'బీసీ రిజర్వేషన్లను బీజేపీయే అడ్డుకుంటోంది'



కాచిగూడ: విద్యా, ఉద్యోగ స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42శాతం రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. బీజేపీకి దమ్ముంటే వెంటనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి బీసీ బిల్లును ఆమోదించాలన్నారు. ఇండియా కూటమి పూర్తి మద్దతు ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఆయనను కలిసిన వారిలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి నాగభూషణం, కొమరయ్య, ఉపాధ్యక్షుడు సురేష్, జిల్లా ప్రధానకార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బీసీ యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఈనెల 31వ తేదీన రవీంద్రభారతిలో నిర్వహించనున్న బీసీ యుద్ధభేరి పోస్టర్‌ను గురువారం టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి తంగెళ్లమూడి నందగోపాల్, జోషి రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

టెక్స్ట్ బుక్‌ప్రెస్ సూపర్‌వైజరీ స్టాఫ్ అధ్యక్షుడిగా కిరణ్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టెక్స్ట్ బుక్ ప్రెస్ సూపర్‌వైజరీ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సిరిగిరి కిరణ్ ఎన్నికయ్యారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో అసోసియేషన్ సభ్యులు సిరిగిరి కిరణ్‌ను ఘనంగా సత్కరించారు. వర్కింగ్‌కు ప్రెసిడెంట్‌గా టి.జగత్ కాంతరావు, ముఖ్య సలహాదారులుగా కె.విజయ్‌కుమార్, సయ్యద్ అక్బర్, ఎస్.మోహన్‌రావు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్స్‌గా వి.గోపీకృష్ణ, పి.వి.రమణమూర్తి, కె.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎం.అనిల్‌కుమార్, ఎం.వెంకటరమణ, ఎం.అంరేష్, కె.మురళీమోహన్, సయ్యద్ జావెద్, డి. నరేందర్, ప్రధాన కార్యదర్శిగా ఎ.ప్రవీణ్‌కుమార్, కోశాధికారులుగా కె.సుబ్బారెడ్డి, వై.రాజు, కార్య నిర్వాహకులు ఎం.రాజశేఖరయ్య, ఎ.శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా బి.దేవేందర్, కార్యాలయ సెక్రటరీగా పి.పండరి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.పూర్ణ చందర్‌లతో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

దూరదర్శన్ కళాకారులలో ప్రముఖుడు సుబ్బరాయశర్మ

చిక్కడపల్లి: సుబ్బరాయశర్మ దూరదర్శన్ తొలి తరం కళాకారులలో ప్రముఖుడని దూరదర్శన్ విశ్రాంత డైరెక్టర్ పి.మధుసూదనరావు అన్నారు. కిన్నెర ఆర్ట్‌థియేటర్స్ త్యాగరాయ గానసభల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాత్రి సినీ ప్రముఖుడు ఎస్‌వీ రామారావు తల్లిదండ్రులు చంద్రమౌళీశ్వరరావు, కామేశ్వరమ్మల జ్ఞాపకార్థం ఈశ్వర పురస్కారం ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ రంగస్థల, సినీచ టీవీ నటుడు సుబ్బరాయశర్మకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె.హనుమంతరావు మాట్లాడుతూ... సుబ్బరాయశర్మ ఎందరో కళాకారులను నాటక రంగానికి పరిచయం చేశారని అన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (45) బుద్వేల్ - శివారంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఆరామ్‌ఘర్ బ్రిడ్జి వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

చిక్కడపల్లి: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరి జిల్లా రాజోలు మండల్ మల్కిపురం గ్రామానికి చెందిన పవన్(25) జీవన ఉపాధి కోసం నగరానికి వలస వచ్చాడు. నగరంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని వింటేజ్ బార్ పక్కన ఉన్న భవన యజమాని రాకేశ్‌రెడ్డి వద్ద డ్రైవర్‌గా ఏడాది నుంచి పని చేస్తున్నాడు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని యజమాని భవనంలోని పై అంతస్తులో నివాసం ఉంటున్నాడు. యజమాని బుధవారం పవన్‌కు ఫోన్ చేయగా పవన్ లిఫ్ట్ చేయలేదు. కాగా భవనం మరమ్మతుల పనులు జరుగుతున్న నేపథ్యంలో కార్మికులు పవన్ ఉన్న రూంలో నుంచి దుర్వాసన వస్తోందని పోలీసులు సమాచారం ఇచ్చారు. వెంటనే చేరుకున్న పోలీసులు తలుపులు బద్దలు కొట్టి చూడగా పవన్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. చారు. అతని అన్న కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసును నమోదు చేశారు.

శరణం గణేశా.!

కనుల పండువగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు బుధవారం అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా ఏర్పాటు చేసిన మండపాల్లో గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో గణపతి హోమాలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. రంగురంగుల విద్యుద్దీపాల వెలుగుల్లో మండపాలు ఆకట్టుకుంటున్నాయి. ఆలయాలను తలపించేలా ప్రత్యేక డిజైన్లతో భారీ సెట్టింగ్ వేశారు. బస్తీలు, కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో స్థానికులు కుటుంబ సమేతంగా సామూహిక పూజల్లో పాల్గొని బొజ్జ గణపయ్య సేవలో నిమగ్నమయ్యారు.

– అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ బృందం


చెప్పల్‌బజార్‌లో వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, అడిషనల్ డీసీపీ నర్సయ్య


పటేల్‌నగర్‌లో గణేశ్ పూజల్లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్


చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


ముషీరాబాద్‌లో పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ నేత శివముదిరాజ్


గ్రీన్ రిచ్ రెసిడెన్సీలో గణనాథుడికి పూజలు


శక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


రాంనగర్‌లో పూజలు నిర్వహిస్తున్న కార్మిక నాయకుడు వి.శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి


సాయిబాబా మందిరంలో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు


విజ్ఞానపురికాలనీ మహిళా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో..


లక్ష్మీగణపతికి 25కిలోల లడ్డును సమర్పించేందుకు తీసుకొస్తున్న ఆలయ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్


శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో జరిగిన పూజలో ఎమ్మెల్యే ముఠాగోపాల్


పూజలో కార్పొరేటర్ అమృత,ఎన్.గౌతంరావు


గణేశ్ మండపంలో ప్రముఖ క్లాసికల్ సింగర్ మాళవిక ఆనంద్‌ను సత్కరిస్తున్న నరేందర్‌గౌడ్


బురుజు గల్లీలో జరిగిన పూజలో మాజీ ఎంపీ వీహెచ్, కార్పొరేటర్ పద్మ


కాచిగూడ వైశ్య హాస్టల్‌లో..


బర్కత్‌పుర హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కులో..


బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో.. జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, డా. ఎన్.గౌతంరావు



గణేశ్ మండప నిర్వాహకులకు లడ్డులను పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు గౌతంరావు


గోవింద్‌నగర్‌లో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



దైవభక్తి.. దేశభక్తి.!

భక్తులను ఆకట్టుకుంటున్న 'ఎస్–400 గణేశ్'

హిందూ వారియర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఎస్–400 వినాయకుడు'అందరినీ ఆకట్టుకుంటున్నాడు. చెప్పల్‌బజార్ మహా గణపతి పక్కనే ఏర్పాటు చేసిన ఈ గణపతిని 'ఎస్–400 గణేశ్'అని పిలుచుకుంటున్నారు. మండపంలో ఆపరేషన్ సిందూర్ పోస్టర్లు పెట్టి భక్తులకు అవగాహన కల్పిస్తున్నారు. దైవభక్తితో పాటు దేశభక్తిని నింపడానికి వినూత్నంగా ఎస్–400 గణేశ్‌ను ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

– కాచిగూడ




బండమైసమ్మ నగర్‌లోని వినాయక మండపంలో జరిగిన పూజలో భక్తులు


శివాజీచౌక్ శివాజీ యువజన సంఘం భాగ్యనగర్ ఆధ్వర్యంలో..


అడ్వకేట్స్‌కాలనీలో శివాజీ యూత్ అసోసియేషన్‌లో..



ఆపరేషన్ సిందూర్ ప్రతిబింబించేలా గణపతి మండపం

ప్రేమ సహజమైన మానవ అవసరం

డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రేమ అనేది సహజమైన మానవ అవసరమని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా. హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు 'ప్రేమ – మానసిక ఆరోగ్యం'అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మనిషి పుట్టిన తరువాత ప్రేమ కోరుకోవడం సహజమని అయితే యుక్త వయస్సులోని ప్రేమ వేరుగా ఉంటుందన్నారు. ఆ వయస్సులో హార్మోన్ల మార్పులు వ్యక్తిత్వ శోధన కొత్త అనుభవాలు ఎక్కువ ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. యుక్త వయస్సులో హార్మోన్ల మార్పు వల్ల ఆకర్షణ బలంగా పనిచేస్తుందని తెలిపారు. 'నేను ఎవరు? నా జీవితానికి అర్థం ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉందన్నారు. ఆలోచించకుండా భావోద్వేగాలకు లోనై నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదన్నారు. ప్రేమ అనేది జీవితంలో ఒక భాగం మాత్రమేనని జీవితమే కాదు అనే విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.వాణి, శ్రీ,లయన్స్ క్లబ్‌సభ్యులు జయశ్రీ, లక్ష్మీతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న పద్మాకమలాకర్

బీజేపీ బలోపేతానికి మరింత కృషి

కాచిగూడ: హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా పందిళ్ల ప్రసాద్, జిల్లా కార్యదర్శిగా నర్సింగ్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నేత గోపిశెట్టి ప్రమోద్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు గురువారం పందిళ్ల ప్రసాద్, నర్సింగ్ ముదిరాజ్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా తమ వంతు కృషి చేస్తామని అన్నారు.


పందిళ్ల ప్రసాద్‌ను సత్కరిస్తున్న గోపిశెట్టి ప్రమోద్

భక్తిశ్రద్ధలతో పునశ్చరణ మహోత్సవాలు

నల్లకుంట: బాగ్‌అంబర్‌పేటలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం సాయిబాబా దేవాలయ పునశ్చరణ మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం సాయిబాబాకు క్షీరాభిషేకం కావించి, కాకడ హారతి ఇచ్చారు. అనంతరం మంగళవాయిద్యాలు, గురు వందనం, అఖండ దీపారాధనతో ప్రారంభమయ్యింది. అలాగే మందిరం ప్రాంగణంలో మండపారాధన చేసి వేదపండితులు శ్రీలక్ష్మీగణపతి హవనం(సహస్ర మోదకాలతో) నిర్వహించారు. సాయంత్రం జపం, ప్రదోషకాలార్చన, మహామంగళ హారతి, మంత్రపుష్పం చేశారు. ఉదయం బాబాకు కాకడ హారతి అనంతరం అన్నదానం చేశారు. ప్రారంభ వేడుకల్లో షిరిడీ సాయిబాబా సంస్థాన్ పాలకమండలి సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు నవచండీ పారాయణ, హోమం..

మహోత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం(నేడు) ఉదయం 7.30 గంటలకు నవచండీ పారాయణం, హోమం ఉంటుందని షిరిడీ సాయిబాబా సంస్థాన్ పాలకమండలి ప్రతినిధులు తెలిపారు. అలాగే సాయంత్రం 4గంటలకు లింగార్చన, ప్రదోషపూజ, మంగళహారతి, మంత్ర పుష్పం ఉంటుందని చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఇష్టదైవాల కృపకు పాత్రులు కావాలని కోరారు.


సాయిబాబా మందిరంలో శ్రీలక్ష్మీగణపతి హోమం

బీజేపీ సీనియర్ నేత ఆకుల సురేందర్ కన్నుమూత



చిక్కడపల్లి: గాంధీనగర్ బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి ఆకుల సురేందర్(53) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ బుర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠా జైసింహ, బీజేపీ సీనియర్ నేతలు పూసరాజు, వినయ్‌కుమార్, మద్దూరి శివాజీ, బీఆర్ఎస్ ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ఆకుల శ్రీనివాస్ తదితరులు ఆకుల సురేందర్ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి భార్య జ్యోతి, కుమారుడు అభిషేక్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ... జేపీ పటిష్ఠత కోసం ఆకుల సురేందర్ ఎంతో కృషి చేశారన్నారు. అందరితో కలసిమెలసి ఉండేవారన్నారు. ఆయన లేని లోటు పార్టీకి తీరనిదని పేర్కొన్నారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సెల్‌ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించారు. బన్సీలాల్‌పేటలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు చేశారు.


ఆకుల సురేందర్ అంత్యక్రియలలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

పోర్టబుల్ పాండ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్

కవాడిగూడ: ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన పోర్టబుల్ పాండ్‌ను మండపాల నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలని సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ కోరారు. చిన్న సైజు విగ్రహాలను ఈ పోర్టబుల్ పాండ్‌లో నిమజ్జనం చేయాలన్నారు. గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో పోర్టబుల్ పాండ్ పనితీరును ఆయన డీఎంసీ రామానుజులు రెడ్డి, హెల్త్ అధికారి ప్రవీణ, మున్సిపల్ డీఈ సన్నీ, ఏఈ వినోద్‌తో కలిసి పరిశీలించారు. ఈ పాండ్‌లో ఒకటి నుంచి మూడు ఫీట్ల గణపతులను నిమజ్జనం చేయవచ్చని తెలిపారు. అదేవిధంగా మరో వైపు ఏర్పాటు చేసిన కొలనులో ఒకటి నుంచి 6 ఫీట్ల విగ్రహాలను నిమజ్జనం చేయవచ్చని పేర్కొన్నారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో ఏర్పాటు చేసిన వినాయకులను ఈ (పాండ్) నీటి కొలనులో నిమజ్జనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ స్టేడియంలో పోర్టబుల్ పాండ్స్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జడ్‌సీ రవికిరణ్, అధికారులు